వ్యాస మహర్షి రచించిన

# శ్రీ బ్రహ్మ పురాణం



వచనం.జయంతి చక్రవర్తి


నిత్ర 2021 క్యాలెండర్

Download Nithra Calendar Click Here

http://bit.ly/ntecpdf



3+ Million Downloads

తెలుగు లో No.1 క్యాలెండర్

# నిత్ర తెలుగు క్యాలెండర్

యాప్‌ను ఉపయోగించవలసినవారు
ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి.
లేదా bit.ly/telugucalendar2020 ని
ప్లేస్టోర్‌లో డౌన్‌లోడ్ చేసుకోగలరు.

- రోజు వీక్షణ / మాస వీక్షణ
- పంచాంగం
- శుభ ముహూర్తాలు
- దిన రాశి ఫలాలు
- పండుగలు మరియు సెలవు దినములు
- నోములు మరియు వ్రతాలు - 116
- ఉపవాస దినములు
- గౌరీ పంచాంగం / హోర చక్రము
- స్మార్ట్ టూల్స్ / రక్తదానం
- వాస్తు టిప్స్
- పద్యములు / శ్లోకాలు మరియు పురాణాలు
- పొడుపు కథలు / సామెతలు
- శిశు జనన పాద దోషములు
- నవరత్నములు
- నామకరణం
- బల్లిశాస్త్రము
- వివాహ మ్యాచింగ్
- అష్టమి / నవమి
- ముహూర్త విజ్ఞానము



నిత్ర తెలుగు క్యాలెండర్

**అంతర్జాతీయ క్యాలెండర్లు**

ప్రతివారం యూట్యూబ్‌లో శ్రీ కప్పగన్తు సుబ్బరామ సోమయాజులు గారి
వారఫలాలు మరియు పండుగ విశేషాలు

ప్రతిరోజూ ఆ రోజూ విశేషాలతో నోటిఫికేషన్లు మొదలైన మరెన్నో విషయములు గురించి తెలుగులో మీకు ఈ యాప్‌లో లభించును.

# పురాణ పురుషుడు శ్రీమన్నారాయణుడు



# విషయసూచిక


| | |
|---|---|
| బ్రహ్మపురాణంలోని విషయాలు | 16 |
| విష్ణుస్తుతి | 17 |
| వ్యాసస్తుతి | 17 |
| విష్ణుస్తుతి | 18 |
| ఆదిసర్గ | 19 |
| శ్రీకృష్ణుడి వంశం-జన్మవృత్తాంతం | 20 |
| పాతాళలోకం | 22 |
| రకరకాల నరకాలు | 23 |
| భూలోకంలో వున్న సకల తీర్థాలు | 27 |
| భారతవర్షం | 32 |
| కోణాదిత్య(కోణార్క్)క్షేత్ర మాహాత్మ్యం | 34 |
| సూర్యుడి పూజావిధానం-ఫలితాలు | 36 |
| సూర్యుడి అష్టోత్తర శతనామస్తోత్రం | 38 |
| దక్షుడు చేసిన శివస్తుతి | 40 |
| ఉత్కల (విరజా) క్షేత్రం | 49 |
| అవంతీ వైభవం | 50 |
| (పూరి) పురుషోత్తమ క్షేత్ర మాహాత్మ్యం | 51 |
| పురుషోత్తమ క్షేత్రం పూర్వకథ | 52 |
| పురుషోత్తమ క్షేత్రాన్ని దర్శించిన - ఇంద్రద్యుమ్నుడు | 56 |
| వాసుదేవస్తుతి | 58 |
| మార్కండేయ మహర్షి వటవృక్షాన్ని దర్శించటం | 62 |
| మార్కండేయ తీర్థంలో స్నానవిధి | 68 |
| కల్పవృక్షం (మర్రిచెట్టు) నమస్కార విధి | 69 |
| నృసింహోపాసన మాహాత్మ్యం | 72 |
| శ్వేతమాధవ మాహాత్మ్యం | 74 |
| శ్వేతకృత విష్ణుస్తుతి | 76 |
| పంచతీర్థ స్నానవిధి | 79 |
| శ్రీకృష్ణ బలరామ సుభద్రల అభిషేకఫలం | 82 |
| శ్రీ కృష్ణస్తుతి | 83 |
| గుడివాయాత్రవిధి - ఫలం | 85 |
| పురుషోత్తమ పూజావిధి | 85 |
| శ్రీమహావిష్ణు లోకవైభవం | 86 |
| అనంత వాసుదేవ వైభవం | 88 |
| కండుమహర్షి ఉపాఖ్యానం | 91 |
| బ్రహ్మ పార స్తుతి | 95 |
| కండుముని చేసిన - పురుషోత్తమ స్తోత్రము | 96 |
| సంసార చక్రం | 101 |
| పాపాలు చేసినవారు పొందే జన్మలు | 103 |
| అన్నదాన మాహాత్మ్యం | 105 |
| సదాచారాలు | 107 |
| వర్ణాశ్రమ ధర్మాలు | 114 |
| ఆశ్రమ ధర్మాలు | 116 |
| సంకరజాతి-వర్ణసాంకర్య లక్షణాలు | 119 |
| ఉత్తమగతి ప్రాప్తి | 120 |
| వాసుదేవుడి మహిమ | 125 |
| శ్రీమహావిష్ణు భక్తులు పొందే - ఉత్తమగతులు | 129 |
| అల్పశ్రమతో అధికపుణ్యం | 131 |
| ప్రళయకాల సమయంలో - మానవుల ప్రవర్తన | 132 |
| క్షర-అక్షర తత్త్వాలు | 134 |
| బ్రహ్మపురాణ ఫలశ్రుతి | 136 |

# ఉపోద్ఘాతము

అం.ఆ

**వక్రతుండ మహాకాయ కోటిసూర్య సమప్రభ ।**
**నిర్విఘ్నం కురుమేదేవ సర్వకార్యేషు సర్వదా ॥**

**వ్యాసం వశిష్ఠనప్తారం శక్తేః పౌత్ర మకల్మషమ్ ।**
**పరాశరాత్మజం వందే శుకతాతం తపోనిధిమ్ ॥**

## అష్టాదశ పురాణాలు

మన భారతవాఙ్మయంలో వేదాల తరువాత అంతటి ప్రాశస్త్యాన్ని పొందిన గ్రంథాలు పురాణాలు. వేదాల్లో చెప్పిన ధర్మాల్ని కథలరూపంలో, ఆఖ్యానాల రూపంలో సామాన్యులకు సైతం అర్థమయ్యేలా తెలియచెప్పేవే పురాణాలు. అందుకే పురాణాల్ని పంచమవేదంగా కీర్తించారు. అసలు పురాణం అంటే? పురా అపినవం-పురాతనమైనప్పటికీ నూతనంగా వుండేది అని అర్థం. అలాగే 'పురా ఆనతి' అంటే ప్రాచీనకాలంలో జరిగింది అని, వాయుపురాణం పురాణశబ్దాన్ని నిర్వచిస్తే, 'పురాఏతత్ అభూత్' పూర్వం ఇలా జరిగింది అని బ్రహ్మాండ పురాణం పురాణశబ్దానికి అర్థాన్ని చెబుతుంది. వీటన్నిటినీ క్రోడీకరించి చూస్తే పురాణం అంటే పూర్వకాలంలో జరిగిన ఎన్నో విషయాల్ని వివరించి చెప్పేది అని తెలుస్తోంది.

పురాణాలు ఎన్ని-

పురాణాలు మహాపురాణాలు, ఉపపురాణాలని రెండు విధాలుగా వున్నాయి. మహాపురాణాలు 18, అలాగే ఉపపురాణాలు 18.

**బ్రహ్మం పాద్మం వైష్ణవం చ వాయవీయం తథైవచ ।**
**భాగవతం నారదదీయం మార్కండేయంచ కీర్తితమ్ ॥**

**ఆగ్నేయంచ భవిష్యంచ బ్రహ్మవైవర్త లింగకే ।**
**వారాహంచ తథా స్కాందం వామనం కూర్మ సంజ్ఞకమ్ ।**
**మాత్స్యం చ గారుడం తద్వద్బ్రహ్మాండాఖ్యమితి త్రిషట్ ॥**

1.బ్రహ్మపురాణం 2.పద్మపురాణం 3.విష్ణుపురాణం 4.వాయు పురాణం 5.భాగవత పురాణం 6.నారదపురాణం 7.మార్కండేయ పురాణం

8.అగ్నిపురాణం 9.భవిష్యపురాణం 10.బ్రహ్మవైవర్త పురాణం 11.లింగపురాణం 12. వరాహ పురాణం 13.స్కాంద పురాణం 14.వామన పురాణం 15.కూర్మ పురాణం 16.మత్స్య పురాణం 17.గరుడ పురాణం 18.బ్రహ్మాండ పురాణం- ఈ పద్దెనిమిదీ మహాపురాణాలు. అలాగే 18 ఉపపురాణాలు కూడా వున్నాయి. ఈ మహాపురాణాల పేర్లని గుర్తుంచుకోవటానికి శ్లోకం కూడా వుంది.

**'మ' ద్వయం 'భ' ద్వయం చైవ 'బ్ర'త్రయం 'వ' చతుష్టయం।**
**అనాపలింగ కూస్కాని పురాణాని పృథక్ పృథక్ ॥**

'మ' తో మొదలయ్యేవి రెండు 1.మత్స్య 2.మార్కండేయ

'భ' తో మొదలయ్యేవి రెండు 1.భాగవత 2.భవిష్య

'బ్ర' తో మొదలయ్యేవి మూడు 1.బ్రహ్మ 2.బ్రహ్మవైవర్త 3.బ్రహ్మాండ

'వ' తో మొదలయ్యేవి నాలుగు 1.వాయు 2.విష్ణు 3.వామన 4.వరాహ

అ-అగ్ని, నా-నారద, ప-పద్మ, లిం-లింగ, గ-గరుడ, కూ-కూర్మ, స్కా-స్కాంద ఇలా మొత్తం పద్దెనిమిది పురాణాలు.

## పురాణాలు విష్ణుస్వరూపం

అష్టాదశ పురాణాలను సాక్షాత్తు విష్ణు స్వరూపంగా పోల్చారు. 18 పురాణాలని మహావిష్ణువు శరీరంలోని 18 అంగాలుగా భావిస్తారు మన ప్రాచీన ఋషులు.

1. బ్రహ్మపురాణం - శ్రీ మహావిష్ణువు శిరస్సు
2. పద్మపురాణం - శ్రీ మహావిష్ణువు హృదయం
3. విష్ణుపురాణం - శ్రీ మహావిష్ణువు కుడిభుజం
4. వాయుపురాణం - శ్రీ మహావిష్ణువు ఎడమభుజం
5. భాగవతపురాణం - శ్రీ మహావిష్ణువు ఊరువులు
6. నారదపురాణం - శ్రీ మహావిష్ణువు నాభి
7. మార్కండేయపురాణం - శ్రీ మహావిష్ణువు కుడిపాదం
8. అగ్నిపురాణం - శ్రీ మహావిష్ణువు ఎడమపాదం

9. భవిష్యపురాణం - శ్రీ మహావిష్ణువు కుడిమోకాలు
10. బ్రహ్మవైవర్తపురాణం - శ్రీ మహావిష్ణువు ఎడమమోకాలు
11. లింగపురాణం - శ్రీ మహావిష్ణువు కుడి చీలమండ
12. వరాహపురాణం - శ్రీ మహావిష్ణువు ఎడమ చీలమండ
13. స్కందపురాణం - శ్రీ మహావిష్ణువు కేశాలు
14. వామనపురాణం - శ్రీ మహావిష్ణువు చర్మం
15. కూర్మపురాణం - శ్రీ మహావిష్ణువు పృష్ఠభాగం
16. మత్స్యపురాణం - శ్రీ మహావిష్ణువు మెదడు
17. గరుడపురాణం - శ్రీ మహావిష్ణువు మాంససారం
18. బ్రహ్మాండపురాణం - శ్రీ మహావిష్ణువు ఎముకలు

పురాణ లక్షణం :-

**సర్గశ్చ ప్రతిసర్గశ్చ వంశోమన్వంత రాణి చ ।**
**వంశానుచరితం చేతి పురాణం పంచ లక్షణం ॥**

పురాణానికి ఐదు లక్షణాలు ప్రధానంగా వుండాలని చెప్పారు. 1.సర్గ-అంటే ప్రపంచ సృష్టి, 2.ప్రతిసర్గ-ఈ ప్రపంచ ప్రళయం, 3.వంశం-రాజుల, ఋషుల, దేవతలకు సంబంధించిన వంశ విశేషాలు-అవతారాలు 4.వంశానుచరితం-రాజవంశాలలో, ఋషుల వంశాలలో పుట్టిన వారి జీవితచరిత్రలు, 5.మన్వంతరాలు-మనువులు, మనువు ద్వారా ఏర్పడ్డ సంతతి, ఆయా మన్వంతరాలలో జరిగిన విశేషాలు. ఈ విధంగా ప్రతిపురాణం పంచలక్షణాలతో కూడి వుంటుంది.

పురాణకర్త :-

**విష్ణోరంశో మునిర్జాత సత్యవత్యాం పరాశరాత్ ।**
**పురాణ సంహితాం దధ్యే తేషాం ధర్మ విధిత్సయా ॥**

అనే ఈ ప్రమాణ శ్లోకం ప్రకారం సత్యవతీ పరాశర మహర్షి కుమారుడుగా శ్రీ మహావిష్ణు అంశంతో జన్మించిన వ్యాసుడే అష్టాదశ పురాణాల కర్త అని తెలుస్తోంది. ఈయననే కృష్ణద్వైపాయనుడు అని కూడా అంటారు. పురాణాలకు కర్త వ్యాసుడైతే వక్త సూతమహర్షి. ఈయన నైమిశారణ్యంలో శౌనకాది మహామునులకు ఈ పురాణాలన్నిటినీ ప్రబోధించాడు.

పురాణాల ప్రాచీనత :-

వేద వాఙ్మయం ఎంత విస్తృతంగా వుందో, పురాణ వాఙ్మయం కూడా అంత విస్తృతంగా వుంది. సాధారణంగా లోకంలో వేదాలు అత్యంత ప్రాచీనమైనవని చెబుతారు. అయితే ఈ శ్లోకం వేదాలకన్నా పురాణాలే ప్రాచీనమైనవని చెబుతుంది.

**పురాణం సర్వశాస్త్రాణాం ప్రథమం బ్రహ్మణాస్మృతమ్ ।**
**నిత్యం శబ్దమయం పుణ్యం శతకోటి ప్రవిస్తరమ్ ।**
**అనంతరంచ వక్త్రేభ్యః వేదాంతస్య వినిర్గతాః ॥**

పూర్వం బ్రహ్మ నోటి నుంచి వందకోట్ల శ్లోకాలతో ముందు పురాణాలు బయలుదేరి ఆ తరువాత వేదాలు బయలుదేరాయట. ఇలా వందకోట్ల శ్లోకాలతో చతుర్ముఖ బ్రహ్మతో చెప్పబడ్డ పురాణం మొత్తం ఒక్కటిగానే వుండేది. అల్పబుద్ధులైన మానవుల కోసం ఆ బ్రహ్మదేవుడే వ్యాసుడి రూపంలో వచ్చి ఆ కోటిశ్లోకాల పురాణాన్ని నాలుగు లక్షల శ్లోకాలలోకి కుదించి దాన్ని పద్దెనిమిది పురాణాలుగా రచించాడని స్కందపురాణం చెబుతుంది.

**పురాణమేక మేవాసీ దస్మిన్ కల్పాంతరే నృప ।**
**త్రివర్గ సాధనం పుణ్యం శతకోటి ప్రవిస్తరమ్ ॥**
**స్మృత్వా జగాదచ మునీన్ ప్రతి దేవశ్చతుర్ముఖః ।**
**చతుర్లక్ష ప్రమాణేన ద్వాపరే ద్వాపరే సదా ।**
**తదష్టాదశధా కృత్వా భూర్లోకేఽస్మిన్ ప్రభాష్యతే ॥** *(స్కంద పురాణం)*

## పాఠకులకు నమస్కారం

భగవాన్ వేదవ్యాస మహర్షి రచించిన అష్టాదశ పురాణాలు ఆర్షవిద్యా భాండాగారాలు. ఆ భాండాగారాలలో నిక్షిప్తమైన ప్రధాన విషయాల్ని 18 పుస్తకాలుగా క్రోడీకరించి మీ ముందుకు తెస్తున్నాం. సరళమైన భాషలో మేము ప్రచురించిన ఈ 18 పురాణాలని ఆదరించి, మమ్మల్ని ప్రోత్సహిస్తారని ఆశిస్తూ... మీ

***- ప్రకాశకులు, వచనకర్త***

# అష్టాదశ పురాణాల మొదటి వక్త - శ్రోత

అష్టాదశ పురాణాలను మొదటగా చెప్పిన వక్తలు వారి నుంచి మొదటిసారి విన్న శ్రోతలు ఈ క్రింద చెప్పిన విధంగా వుంటారు. అదేవిధంగా ఒక్కొక్క పురాణానికి వక్తృ శ్రోతృపరంపర వేరువేరు విధాలుగా ఉండవచ్చు.

| సం. పురాణం | ఏకల్ప వృత్తాంతం | వక్తృశ్రోతలు |
|---|---|---|
| 1. బ్రహ్మ పురాణాన్ని | బ్రహ్మ కల్పంలో | బ్రహ్మ మరీచి మహామునికి బోధించాడు |
| 2. పద్మ పురాణాన్ని | పద్మ కల్పంలో | స్వయంభువుమనువు బ్రహ్మకు బోధించాడు |
| 3. విష్ణు పురాణాన్ని | వరాహ కల్పంలో | పరాశరుడు బ్రహ్మకు బోధించాడు |
| 4. శివ(వాయు)పురాణాన్ని | శ్వేత కల్పంలో | శివుడు వాయువుకు బోధించాడు |
| 5. భాగవత పురాణాన్ని | సారస్వత కల్పంలో | విష్ణువు బ్రహ్మకు బోధించాడు |
| 6. నారద పురాణాన్ని | బృహత్ కల్పంలో | పూర్వ భాగాన్ని – సనకాదులు నారదునికి బోధించారు. ఉత్తరభాగాన్ని – వశిష్ఠుడు మాంధాతకు బోధించాడు |
| 7. మార్కండేయ పురాణాన్ని | శ్వేత వారాహకల్పంలో | మార్కండేయుడు జైమినికి బోధించాడు |
| 8. అగ్ని పురాణాన్ని | ఈశాన కల్పంలో | అగ్నిదేవుడు వశిష్ఠునికి బోధించాడు |
| 9. భవిష్య పురాణాన్ని | అఘోర కల్పంలో | బ్రహ్మ మనువుకు బోధించాడు |
| 10. బ్రహ్మవైవర్త పురాణాన్ని | రథంతర కల్పంలో | సావర్ణి నారదునికి బోధించాడు |
| 11. లింగ పురాణాన్ని | కల్పాంత కల్పంలో | పరమశివుడు నారదునికి బోధించాడు |
| 12. వరాహ పురాణాన్ని | మనుకల్పంలో | విష్ణువు పృథ్వికి బోధించాడు |
| 13. స్కాంద పురాణాన్ని | తత్పురుషకల్పంలో | స్కందుడు భూమికి బోధించాడు |
| 14. వామన పురాణాన్ని | కూర్మ కల్పంలో | బ్రహ్మ పులస్త్య మహామునికి బోధించాడు |
| 15. కూర్మ పురాణాన్ని | లక్ష్మీ కల్పంలో | విష్ణువు పులస్త్య మహామునికి బోధించాడు |
| 16. మత్స్య పురాణాన్ని | సప్త కల్పంలో | విష్ణువు మనువుకు బోధించాడు |
| 17. గరుడ పురాణాన్ని | గరుడ కల్పంలో | విష్ణువు మనువుకు బోధించాడు |
| 18. బ్రహ్మాండ పురాణాన్ని | భవిష్య కల్పంలో | బ్రహ్మ మనువుకు బోధించాడు |

# పురాణాలు ఎందుకు చదవాలి?

**పురాణశ్రవణే శ్రద్ధా యస్య స్యాద్భ్రాతరస్వహమ్ ।**
**తస్య సాక్షాత్ప్రసన్నః స్యాత్ శివో విష్ణుశ్చ సానుగః ॥**

**యత్స్నాత్వా పుష్కరే తీర్థే యాగే సింథౌ చ సంగమే ।**
**తత్ఫలం ద్విగుణం తస్య శ్రద్ధయా వై శృణోతి యః ॥**

**యే పఠంతి పురాణాని శృణ్వన్తి చ సమాహితాః ।**
**ప్రత్యక్షరం లభంత్యేతే కపిలాదానజం ఫలమ్ ॥**

**అపుత్రో లభతే పుత్రం ధనార్థీ లభతే ధనమ్ ।**
**విద్యార్థీ లభతే విద్యాం మోక్షార్థీ మోక్షమాప్నుయాత్ ॥**

**యే శృణ్వన్తి పురాణాని కోటిజన్మార్జితం ఖలు ।**
**పాపజాలంతు తే హిత్వా గచ్ఛన్తి హరిమందిరమ్ ॥**


పురాణాలు వినడంలో ఎవరికైతే శ్రద్ధ ఉంటుందో మరియు నిత్యము ఎవరైతే శ్రవణం చేస్తారో, అటువంటి వారి విషయంలో శివ-కేశవులు మరియు వారి గణాలు సంపూర్ణానుగ్రహం ప్రదర్శిస్తారు. పుష్కర తీర్థాల్లో, ప్రయాగ మొదలైన నదీసంగమ క్షేత్రాల్లో స్నానాలాచరిస్తే ఏవిధమైన పుణ్యం పొందగలరో దాని రెట్టింపు పుణ్యం పురాణ శ్రోతలకు లభిస్తుంది. భక్తి శ్రద్ధలతో పురాణ పఠన-శ్రవణాలు చేసేవారు కపిలగోవును దానం చేస్తే కలిగే పుణ్యరాశిని పొందగలరు. పుత్రులు లేనివారు పుత్రులను, దరిద్రులు ధనాన్ని, విద్యార్థులు విద్యను, మోక్షగాములు మోక్షాన్ని పొందగలరు. పురాణ శ్రోతలు తమ కోటి జన్మల పాపాలను దూరం చేసికొని చివర్లో శ్రీమన్నారాయణమూర్తి సాయుజ్యం పొందగలరు.

# పురాణ వైభవం

**అష్టాదశ పురాణానాం నామధేయాని యః పఠేత్ ।**
**త్రి సంధ్యం జపతే నిత్యం సోఽశ్వమేధ ఫలం లభేత్ ॥**

ఈ అష్టాదశ మహాపురాణాల పేర్లను ఉదయ-మధ్యాహ్న-సాయంకాల సమయాల్లో ఎవరైతే పఠిస్తారో వారు అశ్వమేధ ఫలాన్ని పొందగలరని భావం.

# శ్రీ బ్రహ్మ పురాణం



శుక్లాంబరధరం విష్ణుం శశివర్ణం చతుర్భుజమ్ ।
ప్రసన్నవదనం ధ్యాయేత్సర్వ విఘ్నోపశాంతయే ॥

నారాయణం నమస్కృత్య నరంచైవ నరోత్తమమ్ ।
దేవీం సరస్వతీం వ్యాసం తతో జయముదీరయేత్ ॥

అష్టాదశ పురాణాలలో బ్రహ్మపురాణం మొదటిది. 'బ్రహ్మం మూర్ధా హరేరేవ' అన్న మాట ప్రకారం ఈ బ్రహ్మపురాణం శ్రీమహావిష్ణువు శిరస్సుగా చెప్పబడింది. "నానాఖ్యానేతిహాసాద్యం దశ సాహస్రముచ్యతే" అనగా ఈ పురాణంలో మొత్తం పదివేల శ్లోకాలున్నాయి. ఇది పూర్వభాగం ఉత్తరభాగం అని రెండు భాగాలుగా విభజించబడింది. ఈ పురాణంలో మొత్తం 246 అధ్యాయాలున్నాయి.

పేరుకి ఈ పురాణం బ్రహ్మపురాణం అనివున్నా ఇందులో బ్రహ్మదేవుడికి సంబంధించిన అంశాలు వుండవు. అత్యధికంగా శ్రీమహావిష్ణువు గురించిన విశేషాలు, కథనాలే ఈ పురాణంలో చెప్పబడ్డాయి. అందుకే ఈ పురాణాన్ని వైష్ణవ పురాణంగానే కీర్తిస్తారు.

ఆద్యం సర్వపురాణానాం పురాణం బ్రహ్మముచ్యతే ।
అష్టాదశ పురాణాని పురాణజ్ఞాః ప్రచక్ష్యతే ॥

అని విష్ణు పురాణంలోని శ్లోకం బ్రహ్మపురాణాన్ని ఆదిపురాణంగా పేర్కొంటుంది. "రాజ సేషుచ మాహాత్మ్య మధికం బ్రహ్మణోవిదుః" అన్న మత్స్య పురాణంలోని శ్లోకం ప్రకారం బ్రహ్మపురాణం రాజసపురాణంగా చెప్పబడింది.

# బ్రహ్మపురాణంలోని విషయాలు

**1-20 అధ్యాయాలు :** వ్యాస స్తుతితో ప్రారంభమైన ఈ పురాణంలో సృష్టికథనం, మన్వంతరాలకీర్తనం, ఆదిత్యుడి జననం, ఆదిత్యుడి కీర్తి, సోముడి జననం, సోమవంశ కీర్తి, పురవంశ వర్ణనం, శ్రీకృష్ణజన్మ సంకీర్తనం, శ్యమంతకోపాఖ్యానం, జంబూద్వీప వర్ణనం, పాతాళప్రమాణం, నరకవర్ణన వంటి ప్రధాన విషయాలు చెప్పబడ్డాయి.

**20-40 అధ్యాయాలు :** వీటిలో సర్వతీర్థ మాహాత్మ్యం, భారతవర్షం, కోణాదిత్య మాహాత్మ్యం, మార్తాండ మాహాత్మ్యం, రుద్రాఖ్యానం, పార్వతీతపస్సు, ఉమామహేశ్వర కల్యాణం, బ్రహ్మచేసిన శివస్తుతి, మన్మథుడి దహనం, దక్షయజ్ఞ విధ్వంసం, దక్షుడు చేసిన శివస్తుతి వంటి ప్రధాన విషయాలు వివరించబడ్డాయి.

**40-69 అధ్యాయాలు :** వీటిలో ఏకామ్రక్షేత్రమాహాత్మ్యం, ఉత్కళక్షేత్ర మాహాత్మ్యం, అవంతీవర్ణన, పురుషోత్తమ క్షేత్ర వైభవం, ప్రతిమానిర్మాణ విధానం, పురుషోత్తముడి వర్ణన, మార్కండేయుడు మర్రి ఆకుని చూడటం, మార్కండేయుడు చూసిన ప్రళయం, పంచతీర్థ మాహాత్మ్యం, నృసింహ మాహాత్మ్యం, శ్వేతమాధవ మాహాత్మ్యం, సముద్ర స్నానవిధి, కృష్ణా నదీ స్నాన మాహాత్మ్యం, గుడివాయాత్ర, ద్వాదశయాత్రలు, విష్ణులోక వైభవం తదితర విశేషాలు వర్ణించబడ్డాయి.

**70-175 అధ్యాయాలు :** వంద అధ్యాయాలలో సంపూర్ణంగా గౌతమీ మాహాత్మ్యం వర్ణించబడింది.

**176-211 అధ్యాయాలు :** వీటిలో అనంతవాసుదేవ మాహాత్మ్యం హరి అంశావతారాలు, శ్రీకృష్ణుడి జననం, గోవర్ధనోద్ధారణం, రుక్మిణీ కల్యాణం, నరకాసురవధ, అనిరుద్ధ చరిత్ర, శ్రీకృష్ణ నిర్యాణం తదితర విశేషాలు వర్ణించబడ్డాయి.

**212-246 అధ్యాయాలు :** వీటిలో విష్ణువు ధరించిన వివిధ అవతారాలు, యమలోక మార్గం, నరకంలోని దుఃఖాలు, అన్నదాన ప్రశంస, సదాచార

వర్ణన, వర్ణాశ్రమ ధర్మాలు, మానవులకి ఉత్తమగతి ప్రాప్తించే మార్గాలు, వాసుదేవమహిమ, ద్వాపర యుగాంతం, యోగాభ్యాసం, జ్ఞాన యోగం, మోక్షప్రాప్తి, విద్య అవిద్యల స్వరూపం, వశిష్ఠ జనక సంవాదం లాంటి ప్రధాన విషయాలు వర్ణించబడ్డాయి.

## విష్ణుస్తుతి

యంధ్యాయంతి బుధాః సమాధిసమయే శుద్ధం వియత్సన్నిభే ।
నిత్యానందమయం ప్రపన్నమమలం సర్వేశ్వరం నిర్గుణమ్ ।
వ్యక్తావ్యక్తపరం ప్రపంచ రహితం ధ్యానైక గమ్యం విభుమ్ ।
తం సంసార వినాశహేతు మజరం వందే హరిం ముక్తిదం ॥

విద్వాంసులు తమ సమాధి స్థితిలో ఎవరిని శుద్ధ స్వరూపుడుగా, ఆకాశంలా సర్వవ్యాపకుడుగా ధ్యానిస్తారో, అలాంటి నిత్యానంద స్వరూపుడిని, ప్రసన్నాత్ముడిని, నిర్మలుణ్ణి, నిర్గుణుణ్ణి, సర్వేశ్వరుణ్ణి, వ్యక్తావ్యక్త స్థితికి అతీతమైనవాడిని, ధ్యానమాత్రగమ్యుడిని, ప్రకాశవంతమైన వాడిని, జననమరణ సంసార వినాశహేతువైన వాడిని మోక్షాన్ని ప్రసాదించేవాడిని, శ్రీహరిని ధ్యానిస్తాను.

## వ్యాసస్తుతి

ఆధార భూతం విశ్వస్యావ్యణీయాంస మణీయసాం ।
ప్రణమ్య సర్వభూతస్థ మచ్యుతం పురుషోత్తమమ్ ॥ 1

జ్ఞాన స్వరూప మత్యంతం నిర్మలం పరమార్థతః ।
తమేవార్థ స్వరూపేణ భ్రాంతి దర్శనతః స్థితమ్ ॥ 2

విష్ణుంగ్రసిష్ణుం విశ్వస్య స్థితౌ సర్గేతథా ప్రభుమ్ ।
సర్వజ్ఞం జగతామీశ మజమక్షయ మవ్యయమ్ ॥ 3

ఆద్యం మసూక్ష్మం విశ్వేశం పరాశర సుతం ప్రభుమ్ ।
గురుం ప్రణమ్య వక్ష్యామి పురాణం వేద సమ్మితమ్ ॥ 4

*(అధ్యా-1, శ్లో-25-29)*

ప్రపంచానికి ఆధారమైనవాడు, అణువుకన్నా అణువుగా వుండేవాడు. సర్వభూతాలలో కొలువైనవాడు, అచ్యుతుడు, జ్ఞానమూర్తి, పరమపవిత్రమైన వాడు, పురుషోత్తముడు, నిర్మలుడు, ఈ జగత్తుగా కనిపిస్తూ భ్రాంతిగొలిపేవాడు, సర్వవ్యాపకుడు, సర్వాన్నీ కబళించేవాడు, సృష్టిస్థితుల్ని చేయగల సమర్థుడు, సర్వస్వతంత్రుడు, సర్వజ్ఞుడు, పుట్టటం, పెరగటం, నశించటం అనేవిలేనివాడు, అన్నిటికన్నా ఆద్యుడు, సూక్ష్మస్వరూపంతో ఉండేవాడు అయిన విశ్వేశ్వరుణ్ణి ముందుగా నమస్కరించి వేదవేదాంగ వేత్త సర్వశాస్త్ర రహస్యతత్త్వాన్ని ఎరిగినవాడు అయిన పరాశరుడి కుమారుడు వ్యాసమహర్షిని నా గురువుగా భావించి వేద తాత్పర్య సదృశమైన ఈ బ్రహ్మపురాణాన్ని చెబుతున్నాను అంటూ రోమహర్షణ మహర్షి (సూతుడు) ఈ దివ్య పురాణాన్ని నైమిశారణ్యంలోని మునులకి చెప్పటం ప్రారంభించాడు.

## విష్ణుస్తుతి

అవికారాయ శుద్ధాయ నిత్యాయ పరమాత్మనే ।
సదైక రూపరూపాయ విష్ణవే సర్వజిష్ణవే ॥ 1

నమో హిరణ్యగర్భాయ హతయేశంకరాయచ ।
వాసుదేవాయ తారాయ సర్గస్థిత్యంత కర్మణే ॥ 2

ఏకానేక స్వరూపాయ స్థూలసూక్ష్మాత్మనే నమః ।
అవ్యక్తావ్యక్త భూతాయ విష్ణవే ముక్తిహేతవే ॥ 3

సర్గస్థితి వినాశాయ జగతో యోఽ జరామరః ।
మూలభూతో నమస్తస్మై విష్ణవే పరమాత్మనే ॥ 4

*(శ్లో॥ 21-24 అధ్యా-1)*

షడ్భావవికారాలు (1.ఉనికి 2.పుట్టటం 3.పెరగటం 4.తరగటం 5.మార్పుచెందటం 6.నశించటం) లేనివాడు, శుద్ధ స్వరూపుడు, నిత్యుడు, సర్వవ్యాపకుడు, సర్వాన్నీ జయించిన వాడు, సృష్టిస్థితి లయాలు చేసేవాడు, ఒకేరూపం, వివిధ రూపాలూ తానే అయినవాడు, స్థూల, సూక్ష్మరూపాలు

ధరించేవాడు, వ్యక్తా వ్యక్త స్వరూపుడు, ముక్తిని ప్రసాదించేవాడు, జగత్తుని నిర్మించి పరిపాలించేవాడు. వార్థక్యం లేనివాడు, మరణం లేనివాడు సర్వానికీ మూలబీజమైనవాడు అయిన విష్ణు పరమాత్మకి నమస్కారం.

## ఆదిసర్గ

అన్నిటికన్నా పూర్వం ఎవరికీ తెలియనిది, వ్యక్తంకానిది, నిత్యంగా వుండేది లేనిది అయిన ఒక దివ్య తత్త్వం ఉన్నది. ఆ తత్త్వం నుంచే పరమేశ్వరుడు ఈ విశ్వాన్ని సృష్టించాడు. దానినే తత్త్వం అంటారు. సకల భూతాలనీ సృష్టించేవాడు బ్రహ్మ. ఆయన నారాయణ పరాయణుడు. అదే మహత్తత్త్వం. అనగా బుద్ధి. దాని నుంచి అహంకారం, ఆ అహంకారం నుంచి పంచభూతాలు ఆవిర్భవించాయి. వీటన్నిటి స్థితులు, భేదాలు బట్టి సకల ప్రాణకోటి సృష్టించబడింది. దీనినే సనాతన ధర్మం లేదా సర్గం (సృష్టి) అంటారు.

స్వయంభువుడైన బ్రహ్మదేవుడు మొదట నీటిని సృష్టించాడు. ప్రకాశించే ఆ జలంలోకి ఆయన తన వీర్యాన్ని (సృష్టి సంకల్పాన్ని) వదిలాడు. "స ఐక్షత బహుస్యాం ప్రజాయేయేతి) తరువాత తానే ఎన్నోరూపాలతో జన్మించాలని భావించాడు.

నీటికి నీరము అనిపేరు. ఈ నీరు మానవ సృష్టికి మూలం. మానవులకి ఆ నీరు మొదటి గమ్యస్థానం. కాబట్టి ఆ నీటిని సృష్టించిన బ్రహ్మ నారాయణుడనే పేరు పొందాడు. ఆయన (బ్రహ్మ) వదలిన వీర్యం ఒక బంగారు గుడ్డుగా మారి నీటిలో తేలింది. తేలిన ఆ అండం నుంచి బ్రహ్మదేవుడు తానే స్వయంభువుగా ఆవిర్భవించాడు. అందుకే ఆయన్ని హిరణ్యగర్భుడు అంటారు.

అండం నుంచి జన్మించిన బ్రహ్మ పదిసంవత్సరాలు పాటు అలాగే వున్నాడు. తరువాత నీరు రూపంలో వున్న ఆ తత్త్వాన్ని దివం-భువం అనే పేర్లతో రెండుగా చేసాడు. ఆ దివం-భువం మధ్యభాగాన్ని ఆకాశంగా నిర్మించాడు. తరువాత ఆ నీటిలో అడుగున వున్న భూమిని పైకి తేల్చాడు. తేలిన భూమికి పది దిక్కుల్ని కల్పించాడు. ఆ భూమి మీద కాలం, మనస్సు,

కామం, క్రోధం, రతి అనే వాటిని సృష్టించాడు. ఇక భూమి మీద సృష్టిని కొనసాగించాలని భావించి తన మనస్సు నుంచి మరీచి, అత్రి, అంగిరసుడు, పులస్త్యుడు, పులహుడు, క్రతువు, వశిష్ఠుడు అనే మహర్షుల్ని వరుసగా సృష్టించాడు. వీరే సప్తర్షులని విఖ్యాతి పొందారు.

ఈ సప్తర్షులకన్నా ముందుగానే బ్రహ్మ తనలోని రోషం నుంచి రుద్రుణ్ణి, ఆయన తరువాత సనత్కుమారుణ్ణి సృష్టించాడు. బ్రహ్మ మనసు నుంచి ఆవిర్భవించిన సప్తర్షుల ద్వారా ఎంతోమంది ప్రజలు, ప్రజాపతులు, ఏకాదశరుద్రులు పుట్టారు. వీరిలో స్కందుడు సనత్కుమారుడు సృష్టికార్యం చేయటానికి ఇష్టపడలేదు. అయితే సప్తర్షులు మాత్రం బ్రహ్మ ఆజ్ఞానుసారం గృహస్థులై ప్రజాసృష్టి కొనసాగించారు.

తరువాత బ్రహ్మదేవుడు మేఘాల్ని, మెరుపుల్ని, పిడుగుల్ని, లోహితాలని, ఇంద్రధనుస్సును, పశుపక్ష్యాదుల్ని సృష్టించాడు. యజ్ఞయాగాది క్రతువుల కోసం ఋగ్వేదాన్ని, యజుర్వేదాన్ని, సామవేదాన్ని సృష్టించాడు. వాటి తరువాత సిద్ధుల్ని, సాధ్యుల్ని సృష్టించాడు. ఆ విధంగా బ్రహ్మ శరీరం నుంచి ఎన్నో భూతాలు (ప్రాణులు) ఆవిర్భవించాయి.

ఇలా ఎంతచేసినా తన సృష్టి అనుకున్నంత వేగంగా వృద్ధి చెందటం లేదు. అది గమనించిన బ్రహ్మ తన శరీరాన్ని రెండు భాగాలుగా చేసాడు. అవి ఒకటి పురుషుడు, రెండోది స్త్రీగా మారింది. ఆ పురుషుడు స్త్రీ ద్వారా ఎంతోమంది మానవుల్ని కన్నాడు. ఆ పురుషుడే ముల్లోకాల్లో వ్యాపించి విష్ణువు అనే పేరుతో ప్రసిద్ధుడయ్యాడు. ఆ పురుషుడే విరాట్పురుషుణ్ణి సృష్టించాడు. ఆయనే మనువుని కూడా సృష్టించాడు. ఆ మనువు వంశపరంపరే మన్వంతరం అని విఖ్యాతి చెందింది. మనువు ద్వారా అసంఖ్యాకంగా మానవజాతి వృద్ధి చెందింది. బ్రహ్మ మానవసృష్టిలో ఇది రెండోది.

## శ్రీ కృష్ణుడి వంశం - జన్మవృత్తాంతం

క్రోష్టుడు అనేవాడికి ఇద్దరు భార్యలు గాంధారి–మాద్రి. వీరిలో గాంధారి అనమిత్రుడనే వాడిని, మాద్రి యధాజత్తు దేవమీఢుడనే వాణ్ణి కన్నారు.

వీరి సంతానమే కాలక్రమంలో వృష్టివంశంగా మూడు శాఖలతో వర్ధిల్లింది. తిరిగి మాద్రికి – పృష్ణు, అంధకుడు అనే పుత్రులు జన్మించారు. వీరిలో వృష్ణికి శ్వఫల్కుడు, చిత్రకుడు అనే కుమారులుదయించారు.

పృష్ణికుమారుల్లో శృఫల్కుడు పరమధర్మపరాయణుడు. ఆయన పాలనలో అతివృష్టి, అనావృష్టి, వ్యాధి భయం ఇలాంటివేవీ లేకుండా ప్రజలంతా సుఖంగా కాలం గడిపారు. ఆ రోజుల్లో కాశీరాజ్యం మీద కోపంతో ఇంద్రుడు మూడు సంవత్సరాలు అక్కడ వర్షం కురిపించలేదు. అప్పుడు శ్వఫల్కుడు కాశీరాజుని తన రాజ్యానికి తీసుకువచ్చాడు. శ్వఫల్కుడి ఆదరాభిమానాలకి ముగ్ధుడై కాశీరాజు తన కుమార్తెని అతనికిచ్చి వివాహం చేసాడు.

శ్వఫల్కుడికి కాశీరాజు కుమార్తెకి వరుసగా దాత, యజ్వు, వీరుడు, పండితుడు, అతిథిప్రియుడు, భూరిదక్షిణుడు, అక్రూరుడు, ఉపమద్గువు, మద్గువు, మందరుడు, అరమేజయుడు, అవిక్షతుడు, అంధకరువు, అవాహుడు, ప్రతివాహుడు అనే కుమారులు సుందరి అనే కుమార్తె జన్మించారు.వీరిలో అక్రూరుడికి – ప్రసేనుడు, ఉపదేవుడు అనేవారు జన్మించారు.

వృష్ణి రెండో కుమారుడైన చిత్రకేతుడికి పృధువు, విపృధువు, అశ్వగ్రీవుడు, అశ్వబాహువు,సుపార్శ్వుడు, గవేషణుడు, అరిష్టనేమి, అశ్వుడు, సుదర్ముడు, సుబాహువు, బహు బాహువు అనే కుమారులు, శవిష్ఠ శ్రవణ అనే కుమార్తెలు జన్మించారు.

మాద్రి పుత్రుడైన దేవమీఢుడు అసిక్ని అనే ఆమెని వివాహం చేసుకుని ఆమె ద్వారా శూరుడు అనే పుత్రుణ్ణి కన్నాడు. ఆ శూరుడికి 'భోజ్య' అనే భార్య ద్వారా పదిమంది వీరులైన కుమారులుదయించారు. ఆ తరువాత శూరుడికి వసుదేవుడు జన్మించాడు. వసుదేవుడు పుట్టగానే ఆకాశంలో దేవదుందుభులు మ్రోగాయి. పూల వానకురిసింది. చంద్రుడి కాంతితో ప్రకాశించే వసుదేవుడు గొప్ప అందగాడుగా కీర్తిగాంచాడు.

వసుదేవుడు పురవంశంలో పుట్టిన పౌరవి, రోహిణీ, మధిరా, ఆదీ, వైశాఖీ, భద్రా, సునామ్నీ, సహదేవీ, శాంతిదేవీ, శ్రీదేవీ, దేవరక్షితా, వృకదేవీ, ఉపదేవీ, దేవకీ అని పద్నాలుగుమందిని వివాహం చేసుకున్నాడు. ఈ భార్యలలో పౌరవి, రోహిణి అనే ఇద్దరూ బాహ్లికుడి కుమార్తెలు. వసుదేవుడి పెద్ద భార్య పౌరవికి రాముడు, శరణ్యుడు, శరడు, దుర్ధముడు, దమనుడు, శుభ్రుడు, పిండారకుడు, ఉశీనుడు అనే కుమారులు చిత్ర అనే కుమార్తె జన్మించారు. ఈ చిత్రనే సుభద్ర అని కూడా అంటారు.

వసుదేవుడికి దేవకీదేవి ద్వారా శ్రీకృష్ణుడు జన్మించాడు. బలరాముడికి రేవతి ద్వారా నిశరుడు ప్రియపుత్రుడు అనే కుమారులు ఉదయించారు. అర్జునుడికి సుభద్ర ద్వారా అభిమన్యుడు జన్మించాడు. అక్రూరుడికి కాశీరాజు కుమార్తె ద్వారా సత్యకేతువు అనేవాడు జన్మించాడు. ఈ విధంగా క్రోష్టు వంశ పరంపర కొనసాగింది.

## పాతాళలోకం

భూమండలం మొత్తం వైశాల్యం డెబ్భైవేల యోజనాలుంటుంది. దాని ఎత్తుకూడా అంతే పరిమాణంలో వుంటుంది. పాతాళం వైశాల్యం పదివేల యోజనాలు. అతల, వితల, నితల, సుతల, తలాతల, రసాతల పాతాళాలు అనే భూమికింద మొత్తం ఏడు లోకాలుంటాయి. వీటినే సప్త పాతాళ లోకాలంటారు. ఈ పాతాళంలో శుక్ల, అరుణ, పీత శర్కరా, శైలకాంచనీ అనే ప్రదేశాలు ఎత్తైన సౌధాలతో విరాజిల్లుతూ వుంటాయి. అక్కడ దైత్య దానవ జాతులవారు ఎందరో నివసిస్తుంటారు.

అసలు స్వర్గం కన్నా పాతాళలోకమే ఎంతో సుందరంగా వుంటుంది. ఈ విషయాన్ని నారదమహర్షి ఒకసారి ఇంద్ర సభలో చెప్పాడు. పాతాళంలో అందమైనవి ఎంతో దివ్యకాంతిని వెదజల్లే రత్నాలున్నాయి. నాగాభరణాలు నాగ భూషణాలు ఎన్నో వున్నాయి. దైత్యదానవుల కన్యలు ఇక్కడ ఆనందంగా విహరిస్తుంటారు. పగలు సూర్యుడి కిరణాలు కేవలం కాంతినే కలిగిస్తాయి

కానీ వేడిని ఇవ్వలేవు. రాత్రిపూట చంద్రుడి వెన్నెల కాంతుల్ని వెదజల్లుతుంది. తప్ప చలిని కలిగించదు. నిత్యం ఆనందంగా షడ్రసోపేతమైన ఆహారాన్ని భుజిస్తూ సుఖభోగాలలో మునిగి తేలే దానవులకి కాలగమనమే తెలియదు. సుందరమైన నదులతో, తటాకాలతో, విలసిల్లే పాతాళలోకంలో దానవులు దైత్యులతోపాటు నాగులు కూడా భోగాల్ని అనుభవిస్తూ వుంటారు.

ఈ పాతాళలోకానికి అడుగున శ్రీమహావిష్ణువు తమోమయ శరీరం ఆదిశేషుడు అనే పేరుతో విలసిల్లుతుంటుంది. దేవర్షులు, రాజర్షులు, సిద్ధులు ఆయన్నే అనంతుడు అని కీర్తిస్తుంటారు. స్వస్తికముద్రతో విలసిల్లే వేయిపడగలతో ఆదిశేషుడు ప్రకాశిస్తూ వుంటాడు. తన అనుచరులతో సహా అక్కడే నివాసముండే ఆ ఆదిశేషుడు ఒక చేత్తో నాగలి, మరోచేత్తో రోకలి ధరించి, వారుణి అనే నాగకన్యతో ఉపాసించబడుతూ వుంటాడు. కల్పాంతంలో ఆ శేషుడి వేయి పడగల నుంచి విషాగ్నిజ్వాలలు ఉద్భవిస్తాయి. ఆ జ్వాలలలోంచే రుద్రుడు ఆవిర్భవించి మూడులోకాల్నీ భక్షిస్తాడు.

ఒక మహాపర్వతంలాగా వేయి పడగల మీద ఈ భూమండలాన్నంతా భరిస్తున్న అనంతుణ్ణి వర్ణించటానికి దేవతలకి కూడా శక్తి చాలదు. మదోన్మత్తుడైన కళ్ళతో ఆ అనంతుడు ఎప్పుడు విజృంభిస్తాడో అప్పుడే ఈ భూమండలమంతా పర్వతాలు సాగరాలతో సహా కంపిస్తుంది. సకలదేవ, అప్సర, సిద్ధ, చారణ గణాలు సైతం ఆయన మహిమని తెలుసుకోలేరు. అందుకే ఆయన్ని అనంతుడంటారు. మహానుభావుడైన ఆ అనంతుణ్ణి అర్చించి గర్గాచార్యుడు జ్యోతిషవిజ్ఞానాన్ని నేర్చుకున్నాడు. సకల శకునరహస్యాలు తెలుసుకోగలిగాడు.

## రకరకాల నరకాలు

పాపాత్ములైన వారిని వివిధ రకాల శిక్షలకి గురిచేసే నరకాలు చాలానే వున్నాయి. వాటిలో ముఖ్యమైనవి –1.రౌరవం 2.శౌకరం 3.రోధనం 4.తాలం 5.విశనం 6.మహాజ్వాల 7.తప్తకుడ్యం 8.అసిపత్రవనం 9.విమోచనం 10.రుధిరాంధం 11.వసాతప్తం 12.కృమీశం 13.క్రిమిభోజనం 14.మహాలోభం

15.కృష్ణం 16.లాలాభక్షణం 17.పూయవహం 18.వహ్నిజ్వాల 19.అధశ్శరం 20.సదంశం 21.కృష్ణసూత్రం 22.తమస్సు 23.అవీచి 24.శ్వభోజనం 25.అప్రతిష్టం 26.సూచీముఖం అనేవి. ఈ నరకాలన్నీ యమధర్మరాజు పాలనలో వుంటాయి. ఇందులో శస్త్రాస్త్రాలు ధరించినవారు, వాటిని ప్రయోగించగలిగేవారు అయిన యమభటులు వుంటారు. పాపాలు చేసి తమతమ నరకాలకి వచ్చిన వారిని వీరు శిక్షిస్తూ వుంటారు.

**రౌరవనరకం :** దొంగసాక్ష్యాలు చెప్పేవాడు, పక్షపాతంగా మాట్లాడేవాడు, అబద్ధాలు చెప్పేవాడు, నగరాల్ని ధ్వంసం చేసేవాడు, చిన్నపిల్లల్ని చంపేవాడు, గోహత్య చేసినవాడు, జీవులకి ఊపిరి అందకుండా చేసేవాడు భయంకరమైన రౌరవనరకానికి వెళతాడు.

బంగారాన్ని దొంగలించేవాడు, దానికి ప్రోత్సాహాన్నిచ్చినవాడు 'శూకర' అనే నరకానికి వెళతారు. క్షత్రియుల్ని, వైశ్యుల్ని చంపేవారు, గురుపత్నితో, సొంత అక్కాచెల్లెళ్ళతో సంగమంచేసేవాడు, రాజభటుల్ని హత్యచేసేవాడు 'తప్తకుంభం' అనే నరకంలో పడతారు. మద్యపానాన్ని చేసేవాడు, మద్యాన్ని విక్రయించేవాడు, తలారి, చంపదగినవాణ్ణి కాపాడేవాడు, విషాన్ని, విషపదార్థాలని అమ్మేవాడు 'తప్తలోహం' అనే నరకానికి వెళతారు.

స్వంత కోడలితో, కూతురితో సంగమించేవాడు, 'మహాజ్వాలం' అనే నరకానికి చేరి ఘోరంగా శిక్షించబడతాడు. వేదాల్ని దూషించేవాడు, వేదాల్ని విక్రయించేవాడు 'శబలం' అనే నరకానికి వెళతాడు. దొంగతనాలు చేసేవాడు, హద్దుమీరి అతిగా పెద్దల ఎడల ప్రవర్తించేవాడు 'విమోహం' అనే నరకాన్ని చేరుకుంటాడు. దేవతల్ని, విప్రుల్ని, తల్లి తండ్రుల్ని అకారణంగా ద్వేషించేవాడు, రత్నాలని గొప్ప వస్తువుల్ని దూషించేవాడు, 'క్రిమిభక్ష్యం' అనే నరకంలో పడి శిక్షలు అనుభవిస్తాడు. దుష్టయాగాలు చేసేవాడు కృమీశం అనే నరకానికి పితృ తిథుల్ని విస్మరించి భుజించేవాడు 'లాలాభక్ష్యం' అనే నరకానికి వెళతారు. బాణాలను తయారు చేసేవాడు 'వేధకం' అనే నరకానికి ఖడ్గంలాంటి మారణాయుధాల్ని తయారుచేసేవాడు 'విశసనం' అనే నరకంలో పడతారు.

అపాత్రదానం స్వీకరించినవాడు, చేయకూడనివాడితో యజ్ఞయాగాలు చేయించినవాడు, జ్యోతిష్యశాస్త్రం తెలియకుండానే జాతకాలు ముహూర్తాలు చూసి చెప్పేవాడు. 'అధోముఖం' అనే నరకానికి వెళతాడు.

వచ్చిన అతిథులకి అన్నంపెట్టకుండా తాను ఆహారాన్ని స్వీకరించేవాడు, లక్కమాంసం, రసాలు, మధురపానీయాలు, నువ్వులు, ఉప్పు అమ్మే బ్రాహ్మణుడు కూడా 'కృమిపూయ' నరకంలో పడతాడు. పిల్లి, కోడి, మేక, కుక్క, పంది, గుర్రం వంటి జంతువుల్ని పెంచేవాడు కూడా కృమిపూయ నరకానికి చేరుకుంటాడు.

రంగస్థలనటుడు, జాలరి, భగాన్ని చూషించేవాడు, జారుడిని ప్రోత్సహించేవాడు, విషాన్ని పెట్టేవాడు, ఇతరుల మీద చాడీలు చెప్పేవాడు, దున్నపోతుల్ని విక్రయించేవాడు, పర్వదినాల్లో స్త్రీ సంగమం చేసే బ్రాహ్మణుడు, గృహాలను తగులబెట్టేవాడు, మిత్రద్రోహం చేసేవాడు, శకునాలు చెప్పేవాడు, గ్రామపాచకుడు వీరందరూ "రుధిరాంధకూపం (రక్తంతో, చీకటితో కూడిన) నరకంలో పడతారు. అలాగే తేనెతుట్టుని కదిలించినవాడు, గ్రామాన్ని నాశనంచేసినవాడు 'వైతరిణి' అనే నరకానికి వెళతాడు.

వీర్యాన్ని త్రాగినవాడు, మర్యాదని ఉల్లంఘించినవాడు, ఆచారాల్ని సంప్రదాయాల్ని పాటించనివాడు, 'కృచ్ఛము' అనే నరకంలో పడతారు. గొర్రెల మందల్ని పెంచుకుంటూ వాటిమీద ఆధారపడి జీవించేవారు, 'వహ్నిజ్వాలం' అనే నరకానికి వెళతారు. వ్రతలోపం చేసినవాడు, ఆశ్రమధర్మాలను పాటించనివాడు 'సందంశయాతనం' అనే నరకంలో పడతారు. ఉదయం, సాయంత్రం సమయాలలో నిద్రపోయే బ్రహ్మచారులు, పుత్రుల దగ్గర అధ్యయనం చేసినవారు, 'శ్వభోజనం' అనే నరకంలో పడతారు.

ఈ విధంగా వేలకొద్దీ నరకాలున్నాయి. పాపాలు చేసిన జీవులందరూ ఆయానరకాలకి వెళ్ళి నరకయాతనలు అనుభవిస్తారు. తమ తమ కర్మదోషాలు తీరిపోగానే మానవులు స్థావరాలు, జంగమాలు, కృములు, జలచరాలు,

పశువులు, పక్షులు, నదులు, మానవులు, దేవతలు వంటి జన్మల్ని ఎత్తి చివరికి మోక్షాన్ని పొందుతారు. దీన్నే క్రమముక్తి అంటారు.

**ప్రాయశ్చిత్తం :** స్వర్గలోకంలో ఎంతమంది జీవులుంటారో నరకంలో కూడా అంతమంది జీవులూ ఉంటారు. భూలోకంలో పాపాలు చేసి వాటికి ఎలాంటి ప్రాయశ్చిత్తం చేసుకోనివాడు నరకానికి వెళతాడు. వివిధరకాల పాపాలకి తగిన ప్రాయశ్చిత్తాలను మన మహర్షులు స్మృతి గ్రంథాలలో తెలిపారు. పెద్ద పాపాలకు పెద్ద ప్రాయశ్చిత్తాలు, చిన్న పాపాలకు చిన్న ప్రాయశ్చిత్తాలు చెప్పబడ్డాయి. స్వాయంభువ మనువులాంటి మహాపురుషులు ప్రాయశ్చిత్తకాండని రచించారు. అన్ని రకాల పాపాలకీ ఒకటే ప్రాయశ్చిత్తం శ్రీకృష్ణనామస్మరణమే.

ప్రాయశ్చిత్తం అంటే తపస్సు. పాపం చేసినవాడు ఆ పాప పరిహారం కోసం హరినామస్మరణ చేస్తే అంతకన్నా గొప్ప ప్రాయశ్చిత్తం మరేదీలేదు. అలా చేసినవాడు శ్రీమన్నారాయణుడి దివ్య పాదపద్మాల దగ్గరకు చేరుకుంటాడు. ప్రాతఃకాలంలో, సంధ్యాసమయాల్లో శ్రీహరినామస్మరణ చేసేవాడు పాప విముక్తుడవుతాడు. ఎవరి మనసు జపహోమార్చనల మీద, వాసుదేవుడిమీద లగ్నమై వుంటుందో వాడు ముక్తి పొందుతాడు. మహావిష్ణువు మీద స్థిరంగా మనసు నిలిపిన వాడికి ఎప్పుడైనా కొద్దిగా మనసు చలిస్తే అలాంటివాడికి కూడా దేవేంద్రపదవి లభిస్తుంది. కనుక పాపాలు చేసినవాడు, నిరంతరం నారాయణ నామస్మరణ చేస్తుంటే అతడి పాపాలన్నీ క్షయమైపోతాయి. ఇక అతడు నరకాన్ని చూడడు. స్వర్గం అనేది మనసుకి ఆనందాన్ని కలిగిస్తే నరకం మానవుడికి దుఃఖాన్ని కలిగిస్తుంది. స్వర్గ నరకాలంటే పుణ్యపాపాలే తప్ప మరొకటికాదు.

ఒకే వస్తువు సుఖానికీ, దుఃఖానికీ, అసూయకూ, కోపానికీ, కారణమవుతుంది. కాబట్టి ఏ వస్తువైనా దుఃఖాన్ని కలిగించేదే. ఒకప్పుడు తిరస్కరించిన వస్తువునే మరొకప్పుడు స్వీకరించవలసివస్తుంది. కనుక కేవలం దుఃఖాన్ని, కేవలం సుఖాన్ని ఇచ్చే వస్తువే వుండదు. సుఖం, దుఃఖం అనే రెండు పరిణామాలూ కేవలం మానసికమైనవి.

**బ్రహ్మజ్ఞానం :** జ్ఞానాలు రెండు రకాలు 1.లౌకికమైన జ్ఞానం 2. బ్రహ్మజ్ఞానం లౌకిక జ్ఞానం బంధనాలకి కారణమైతే బ్రహ్మజ్ఞానం ముక్తికి దారిచూపిస్తుంది. ఈ ప్రపంచ వ్యవహారమంతా జ్ఞానం వల్లే జరుగుతోంది. జ్ఞానానికి భిన్నంగా ఏదీ జరగదు. విద్య అంటే బ్రహ్మజ్ఞానం, అవిద్య అంటే లౌకిక జ్ఞానం అని తెలుసుకోవాలి. ఉపనిషత్తుల్లో చెప్పబడ్డ జ్ఞానాన్నే బ్రహ్మ జ్ఞానం అంటారు. ఇతరమైన జ్ఞానాలన్నీ కేవలం పునరావృత్తి సహితమైన స్వర్గాదుల్ని పొందటానికి ఉపకరిస్తాయి. కేవలం బ్రహ్మజ్ఞానం మాత్రమే పునరావృత్తి రహితమైన ముక్తిని ప్రసాదిస్తుంది. కనుక బ్రహ్మజ్ఞానప్రాప్తి కోసం మానవుడు తీవ్రంగా శ్రద్ధగా ప్రయత్నించాలి.

## భూలోకంలో వున్న సకల తీర్థాలు

తనచేతుల్ని, పాదాల్ని, మనసుని, స్వాధీనంలో వుంచుకున్నవాడికి, జ్ఞానం, తపస్సు, కీర్తి కలిగినవాడికి సకల తీర్థాలనూ సేవించిన ఫలితం లభిస్తుంది. మనసు, మాట పవిత్రంగా ఉన్నవాడి శరీరంలోనే అన్ని తీర్థాలూ ఉంటాయి. అపరిశుభ్రంగా వున్న కల్లుకుండని ఎన్నిసార్లు కడిగినా దాని కంపుపోనట్టు మనసు పవిత్రంగా, పరిశుద్ధంగా లేకపోతే ఎన్ని దివ్యతీర్థాల్లో మునిగినా అతడు పరిశుద్ధం కాలేడు. దుష్టస్వభావంతో ఉన్నవాడిని, విశృంఖాలంగా సంచరించేవాడిని, ఇంద్రియనిగ్రహం లేనివాడిని, తీర్థాలూ, దానాలూ, వ్రతాలు, ఆశ్రమాలు పవిత్రుణ్ణి చేయలేవు. ఇంద్రియాల్ని అదుపులో ఉంచుకున్నవాడు ఎక్కడుంటే అదే కురుక్షేత్రం. అదే ప్రయాగతీర్థం అవుతుంది.

సూతమహర్షి శౌనకాది మునులకి భూమండలంలో వున్న సకల తీర్థాల గురించీ ఇలా చెబుతున్నాడు –

తీర్థాలలో మొదటిది పుష్కరతీర్థం. తరువాత వరుసగా ప్రసిద్ధమైన తీర్థాలు 1.నైమిశారణ్యం 2.ప్రయాగతీర్థం 3.ధర్మారణ్యం 4.ధేనుకం 5.చంపకారణ్యం 6.సైంధవారణ్యం 7.మగధారణ్యం 8.దండకారణ్యం 9.గయ 10.ప్రభాసతీర్థం 11.శ్రీతీర్థం 12.కనఖలం 13.భృగుతుంగం 14. హిరణ్యాక్షం

15.భీమారణ్యం 16.కుశస్థలి 17. లోహాకులం 18.కేదారం 19.మందరారణ్యం 20.మహాబలం 21.కోటితీర్థం 22.సర్వపాపహర తీర్థం 23.రూపతీర్థం 24.శూకరవతీర్థం 25.చక్రతీర్థం 26.యోగతీర్థం 27.సోమతీర్థం 28.సోహోటక తీర్థం 29.కోకాముఖ తీర్థం 30.బదరీ పర్వతం 31.సోమతీర్థం 32.తుంగకూటం 33.స్కందాశ్రమం 34.కోటితీర్థం 35.అగ్ని పదతీర్థం 36.పంచశిఖరతీర్థం 37.ధర్మోద్భవ తీర్థం 38.గంగాద్వారం 39.పంచకూటం 40.మధ్యకేసరం.

41.చక్రప్రభ 42.మతంగతీర్థం 43.కుశదండతీర్థం 44.దంష్ట్రాకుండం 45.విష్ణుతీర్థం 46.సర్వకామికాతీర్థం 47.మత్స్యతిలతీర్థం 48.బ్రహ్మకుండం 49.వహ్నికుండం 50.సత్యపదతీర్థం 51.చతుస్స్రోతం 52.చతుశ్శృంగం 53.ద్వాదశధారక శైలం 54.మానసం 55.స్థూలశృంగం 56.ఊర్వశీతీర్థం 57.లోకపాలం 58.సోమశైలం 59.మేరుకుండం 59.సోమాభిషేచన తీర్థం 60.మహాశ్రోతతీర్థం 61.కోటరక తీర్థం 62.అమరకంటకం 63.సాలగ్రామ తీర్థం 64.కోటిద్రుమతీర్థం 65.బిల్వప్రభాతీర్థం 66.దేవహ్రదం 67.విష్ణుహ్రదం 68.పున్నాగతీర్థం 69.దేవప్రభ 70.శంఖప్రభ 70.విద్యాధరతీర్థం 71.గాంధర్వం 72.శ్రీతీర్థం 72.బ్రహ్మహ్రదం 73.లోకపాలతీర్థం 74.పంచహ్రదం 75.పిండారక తీర్థం 76.మాలవ్య తీర్థం 77.గోప్రభావతీర్థం 78.గోవరతీర్థం 79.వటమూలక తీర్థం 80.స్నానదండ తీర్థం

81.కన్యాశ్రమం 82.వాయుకుండం 83.జంబూమార్గ తీర్థం 84.గభస్తితీర్థం 85.భద్రతీర్థం 86.మహాకాలవనం 87.వాశిష్ఠతీర్థం 88.దేర్వాసిక తీర్థం 89.ఋషితీర్థం 90.బ్రహ్మతుంగ తీర్థం 91.వసుతీర్థం 92.కుమారికా తీర్థం 93.పంచనద తీర్థం 94.రుద్రపాద తీర్థం 95.కారండవ 96.త్రివిష్టపతీర్థం 97.మణిమత్తతీర్థం 98.కామతీర్థం 99.కృష్ణతీర్థం 100.బ్రహ్మవాలుకా తీర్థం 101.పుష్యన్యాస 102.పుండరీక 103.మణిపుర 104.దీర్ఘసత్ర 105.గంగోద్భేద 106.శివోద్భేద 107.దారుబల

108.ఛాయారోహణ 109.సిద్ధేశ్వరతీర్థం 110.మిత్రబల 111.కాలికాశ్రమ 112.భద్రవట 113.కౌశాంబి 114.దివాకర తీర్థం 115.విజయతీర్థం 116.రుద్రకోటతీర్థం 117.స్యమంతపంచక తీర్థం 118.బ్రహ్మతీర్థం 119.సుదర్శన తీర్థం 120.పారిప్లవ తీర్థం

121.దశాశ్వమేధక తీర్థం 122.సర్పిజ 123.విషయాంతిక 124.వారాహ 125.యక్షిణీ 126.బదరీవన తీర్థం 127.రత్నమూలక 128 లోకద్వార 129.పంచతీర్థం 130.కపిల తీర్థం 131.సూర్య 132.శంఖినీ 133.గోభవన 134.యక్షరాజ 135.బ్రహ్మావర్త 136.సుతీర్థం 137.కామేశ్వర 138.మాతృతీర్థం 139.శీతవన 140.సప్తర్షికుండం 141.దేవీతీర్థం 142.కింజప 143.పాణిఖాత 144.మిశ్రక 145.మనోజవతీర్థం 146.కౌశికీ 147.దేవలోక 148.ఋణమోచన తీర్థం 149.దివ్యతీర్థం 150.విష్ణుపదతీర్థం 151.అమరహ్రద తీర్థం 152.శ్రీకుంజతీర్థం 153.శాలితీర్థం 154 నైమిశేయ తీర్థం 155.బ్రహ్మస్థాన తీర్థం 156.సోమకన్యాతీర్థం 157.సౌగంధిక తీర్థం 158.వనమణితీర్థం 159.సరస్వతీ తీర్థం 160. ఈశాన ప్రవర తీర్థం.

161. పావన తీర్థం 162. త్రిశూలధర తీర్థం 163.మహేంద్ర తీర్థం 164.కృతాలయతీర్థం 165.శాకంభరి తీర్థం 166.కలహ్రద తీర్థం 167.క్షీరస్రవ తీర్థం 168.విరూపాక్షతీర్థం 169.భృగుతీర్థం 170.కశోదక తీర్థం 171.బ్రహ్మయోని తీర్థం 172.నీలపర్వతతీర్థం 173.భద్రవటతీర్థం 174.స్వర్గద్వావర తీర్థం 175.కాళికాశ్రమం 176.రుద్రావర్తం 177.సుగంధాశ్వతీర్థం 178.కపిలావనతీర్థం 179.భద్రకర్ణహ్రదం 180.శంఖకర్ణహ్రదం 181.సప్తసారస్వత తీర్థం 182.కపాలమోచనతీర్థం 183.అపకీర్ణ తీర్థం 184.కామ్యకతీర్థం 185.చతుస్సాముద్రిక తీర్థం 186.రేణుకా తీర్థం 187.స్థాణుతీర్థం 189.కురుతీర్థం 190.కుశధ్వజ తీర్థం 191.విశ్వేశ్వర తీర్థం 192.నారాయణాశ్రమం 193.మాణవక తీర్థం 194.ఇంద్రమార్గతీర్థం 195.భద్రకాళీతీర్థం 196.అరుంధతీతీర్థం 197.నవబ్రహ్మావర్త తీర్థం 198.యమునా తీర్థం 199.ప్రభవతీర్థం 200.సుందరికాశ్రమ తీర్థం

201.ఉర్వీసంక్రమణ తీర్థం 202.బాహుతీర్థం 203.చారునదీతీర్థం 204.మార్కండేయతీర్థం 205.సితోదతీర్థం 206.మత్స్యోదరీతీర్థం 207.సూర్యప్రభాతీర్థం 208.అశోకవనతీర్థం 209.అరుణాస్పదతీర్థం 210.శుక్ర తీర్థం 211.పిశాచమోచనతీర్థం 212.సుభద్రాహ్రదం 213.విమలతీర్థం 214.చండేశ్వరతీర్థం 215.జ్యేష్ఠాతీర్థం 216.జైగీషవ్యగుహాతీర్థం 217.హరితీర్థం 218.కేశవనతీర్థం 220.ఘంటాకర్ణహ్రదం 221.పుండరీక హ్రదం 222.కర్కోటవాపీతీర్థం 223.శ్వేతతీర్థం 224.శ్యామాకూపం 225.చంద్రికా కుండం 226.శ్మశానస్తంభకూపం 227.వినాయక హ్రదం 228.బ్రహ్మావరతీర్థం 229.నాగతీర్థం 230.పులోమక తీర్థం 231.భక్తహ్రదం 232.ప్రేతధారా తీర్థం 233.కుమారకతీర్థం 234.బ్రహ్మావర్తం 235.శృంగమహాతీర్థం 236.సావిత్రీ హ్రదం 237.ధేనుక తీర్థం 238.కోకిలా తీర్థం 239.మతంగహ్రదం 240.పితృకూపం

241.రుద్రతీర్థం 242.శక్ర(ఇంద్ర)తీర్థం 243.సుమాలితీర్థం 244.బ్రహ్మస్థాన తీర్థం 245.సప్తకుండ తీర్థం 246.మణిరత్నహ్రదం 247.జ్యేష్ఠపాలకా హ్రదం 248.విశ్వేశ్వర తీర్థం 249.దేవకూట తీర్థం 250.వీరాశ్రమతీర్థం 251.కుమారధారాతీర్థం 251.శ్రీధారాతీర్థం 252.గౌరీశిఖరతీర్థం 253.శునఃకుండ తీర్థం 254.నందితీర్థం 257.కుమారవాసతీర్థం 258.కుంభకర్ణ హ్రదం 259.కౌశికీహ్రదం 260.ధర్మకామతీర్థం 261.ఉద్దాలక తీర్థం 262.సంధ్యాతీర్థం 263.శోణోద్భవతీర్థం 264.ఋషభకలాతీర్థం 265.పుణ్యావతీహ్రదం 266.బదరికాశ్రమ తీర్థం 267.రామతీర్థం 268.విరజాతీర్థం 269.కృష్ణతీర్థం 270.వటతీర్థం

271.రోహిణీతీర్థం 272.ప్రవరతీర్థం 273.ఇంద్రద్యుమ్నతీర్థం 274.నరతీర్థం 275.సానుగర్తతీర్థం 276.మహేంద్రతీర్థం 277.శ్రీపదతీర్థం 278.ఇషుతీర్థం 279.వార్షభతీర్థం 280.కావేరీహ్రదతీర్థం 281.గోకర్ణతీర్థం

282.గాయత్రీస్నానతీర్థం 283.విసర్జకతీర్థం 284.కుశప్రవణతీర్థం 285.భరతతీర్థం 286.వశిష్ఠాశ్రమతీర్థం 287.రూపశీతికాతీర్థం 288.యోనిద్వారతీర్థం 289.ధేనుక తీర్థం 290.ధన్యకతీర్థం 291.సువర్ణోదపాన తీర్థం 292.మహాశ్రమతీర్థం 293.శ్రుతకోటితీర్థం 294.సకృత్తికాతీర్థం 295.సర్వదేవవ్రతతీర్థం 296.కన్యాశ్రమహ్రదం 297.వికర్ణతీర్థం 298.సానుగర్తతీర్థం 299.వాలఖిల్యమహర్షితీర్థం 300.అఖండితహ్రదం అనేవి ప్రధానమైన తీర్థాలు. ఇవిగాక ఇంకా అసంఖ్యాకమైన తీర్థాలు భూమండలమంతా విస్తరించివున్నాయి.

తీర్థేష్వేతేషు విధివత్సమ్యక్ శ్రద్ధాసమన్వితః ।
స్నానం కరోతి యోమర్త్యః సోపవాసోజితేంద్రియః ॥

దేవాన్ఋషీన్మనుష్యాంశ్చ పిత్రూన్ సంతర్ప్యచక్రమాత్ ।
అభ్యర్చ్యదేవతాస్తత్ర స్థిత్వాచ రజనీత్రయమ్ ॥

పృథక్ పృథక్ ఫలంతేషు ప్రతి తీరేషు భో ద్విజా ।
ప్రాప్నోతి హయమేధస్య నరోనాన్యత్ర సంశయః ॥

యస్త్విదం శృణుయాన్నిత్యం తీర్థమాహాత్మ్య ముత్తమమ్ ।
పఠయేచ్ఛ శ్రావయేద్వాపి సర్వపాపైః ప్రముచ్యతే ॥

*(శ్లో॥ 83-87, అధ్యా - 25)*

మానవుడు ఉదయాన్నే శ్రద్ధగా స్నానవిధులు నిర్వర్తించుకుని, ఉపవాసంతో దేవ, ఋషి, పితృతర్పణాలు చేయాలి. తరువాత దేవతార్చన పూర్తిచేసి మూడు రాత్రులు ఉపవాసం వుండాలి. ఈ విధంగా దీక్షగా మూడు రోజులు ఈ సర్వతీర్థాల నామాలనీ పఠిస్తే ఆయా తీర్థాల్ని దర్శించినంత పుణ్యం లభిస్తుంది. అంతేకాదు అశ్వమేధయాగం చేసిన పుణ్యం ప్రాప్తిస్తుంది. సకల పాపాలనుంచి విముక్తి కూడా లభిస్తుంది.

# భారతవర్షం

పవిత్రమైన భారత వర్షాన్ని కర్మభూమి అంటారు. బ్రాహ్మణాది మహర్షులు ఎందరో ఈ పుణ్య వర్షంలోనే నిత్యకర్మల్ని ఆచరించి సిద్ధి పొందారు. ధర్మార్థకామ మోక్షాలకు స్థానం ఈ భరతవర్షం. ఇంద్రుడు లాంటివారు కూడా ఇక్కడే తపస్సు చేసి, యాగాలు చేసి ఇంద్రపదవిని పొందారు. ఈ భారతవర్షంలోని కఠోరమైన తపస్సుచేసి, యోగ, ధ్యానాల ద్వారా మరికొందరు మహర్షులు మోక్షాన్ని పొందారు. స్వర్గంలో అమర సుఖాలనుభవిస్తున్న వారు కూడా ఒకప్పుడు ఈ పుణ్యభూమిలో సత్కర్మలు ఆచరించే స్వర్గాన్ని చేరారు. దేవతలు రాక్షసులు కూడా ఈ భరత భూమిలోనే నివసించాలని కోరుకుంటారు.

భారతవర్షంలో మొత్తం తొమ్మిది విభాగాలున్నాయి. 1.ఇంద్రద్వీపం 2.కశేరువు 3.తామ్రపర్ణం 4.గభస్తిమంతం 5.నాగద్వీపం 6.సౌమ్యం 7.గాంధర్వం 8.వారుణం 9.మిగిలిన ప్రాంతాలు. సముద్ర పరివేష్టితమైన ఈ భారతఖండంలో ఎన్నో నదులు, ఉపనదులు ఉన్నాయి.

ఈ భారతవర్షంలో పుణ్యాత్ముడైన భార్గవుడు నివసించే గోవర్ధనం ఎంతో పవిత్రమైన ప్రదేశం. ఇక్కడ వాహేక, వాటధాన, సుతీర, కాలతోయద, అపరాస్త, శూద్రా అనే నదులు వర్షాకాలంలో ప్రవహిస్తాయి. సహ్యా పర్వతానికి ఉత్తరదిశలో గోదావరి నదిపుట్టి అది ప్రవహించిన ప్రాంతమంతా భూమండలానికి ఒక సరిహద్దు.

బాహ్లిక, గాంధార, యవనసింధు, సౌవీర, మద్రక, శతద్రుహ, కళింగ, పాద, హారభూషిక, మాకర, కనక, కైకేయ, దంభమాలిక అనేవి క్షత్రియ, వైశ్యశూద్రులు నివాసముండే దేశాలు.

కాలభోజ, బర్బర, లౌకిక, వీర, తుషార, పహ్లావ, ఆధాయత, వర, ఆత్రేయ, భరద్వాజ, పుష్కల, దశేరక, లంచక, శునశ్శోకకులిక, జాంగల, ఔషధి, చల చంద్ర అనేవి కిరాతజాతి నివసించే దేశాలు.

తోమర, హంస, మార్గ, కాశ్మీర, కరుణ, శూలిక, కుహక, మాగధం అనేవి భారతదేశానికి ఉత్తర దిశలో ఉన్న దేశాలు.

భారతదేశానికి దక్షిణ పథంలో – ఆంధ్ర, వామంకరాక, బల్లక, మఖాంతక, అంగ, వంగ, మలద, ఋత్తిక, భద్రతుంగ, ప్రతిజయ, దర్భాంగ, అపమర్దక, ప్రాగ్జోతిష, మద్ర, విదేహ, తామ్ర, తిప్తక, మల్ల మగధక, నందం అనే దేశాలున్నాయి. అలాగే పూర్ణకేవల గోలాంగూల, ఋషిక, ముషిక, కుమార, రామఠ, శక, మహారాష్ట్ర, మాహిషక, కళింగ, అభీర, వైశిక్య, అటవ్య, సభవ, పుళింద, మౌలేయ, వైదర్భ, దండక, పౌలిక, మౌలిక,అశ్మక భోజ, వర్ధన, కాలిక, కుంతల, దంభక, నీల, కాలక అనేవి దక్షిణ భాగంలో వున్న దేశాలు.

శూరినక, కాలిధనలోల, తాటంక అనే దేశాలు అపరాంతదేశాలని చెప్పబడతాయి. మలజ, కర్కశ, మేలక, జోళక, ఉత్తమర్ణ, దశార్ణ, భోజ, కిష్కింధ, తోషల, కోశల, త్రైపుర, వైదిశ, తుంబుర, చర, యవన, పవన, అభయ, రుండికేర, బర్బర, హోత్ర అనేవి వింధ్య పర్వత ప్రాంతంలోని దేశాలు.

నీహార, తుషమార్గ, కురు, తంగణ, స్వపకర్ణ,ప్రావరణ, ఊర్ణ, దర్ఘ కుంతక, చిత్రమార్గ, మాలవాకిరాత, తోమర అనేవి పర్వతాల్ని ఆశ్రయించుకుని వున్న దేశాలు. ఈ ప్రదేశాలలో చతుర్యుగధర్మం నడుస్తుంది. ఈ భారత వర్షానికే తూర్పు దక్షిణాన మహోదధి అనే సముద్రం వుంది. ఉత్తర దిశలో హిమవత్పర్వతం నెలకొంది.ఇది సర్వబీజం వంటిది. సకల జీవులు కర్మల్ని ఆచరించి వాటి ఫలితాల్ని అనుభవించటం కోసం తగిన స్థానం ఇదే.

ఈ పుణ్యభారతావనిలో దేవతలు కూడా మానవ జన్మఎత్తి సత్కర్మల్ని ఆచరించి తత్ఫలితంగా పుణ్యలోకాల్ని చేరాలనుకుంటారు. ఇది తపస్సు చేసేవారికి తగిన ఫలాల్ని ఇచ్చే దేశం. తీర్థయాత్రలు, పుణ్యక్షేత్రాల సందర్శనం, దేవతారాధన, యజ్ఞయాగాదిపుణ్యకర్మలని ఆచరించతగ్గ ప్రదేశం భరతభూమి. బ్రహ్మచర్యాది ఆశ్రమాలు, వ్రతాలు, నోములు వంటివి ఇక్కడ సఫలమౌతాయి. ఎంతో పవిత్రమైన ఈ భారత వర్ష ప్రశంశని పఠించినా విన్నా సర్వపాపాల నుంచీ విముక్తులై విష్ణులోకానికి చేరుకుంటారు.

# కోణాదిత్య (కోణార్క్) క్షేత్ర మాహాత్మ్యం

భారతదేశంలో దక్షిణ సముద్ర తీరాన ఓఢ్ర (ఒరిస్సా) దేశం వుంది. అది మోక్ష భూమి. సముద్ర తీరానికి ఉత్తర దిశలో వున్న విరజామండలం సరిహద్దుల దాకా ఓఢ్రదేశం నెలకొని వుంది. ఆ దేశంలో వుండే బ్రాహ్మణులు పండితులు, స్వాధ్యాయపరులు, పూజనీయులు, యజ్ఞ, దాన, వివాహ, ఉపనయన, శ్రాద్ధకర్మలు శాస్త్రోక్తంగా చేయగలిగిన వారు. షట్కర్మ (యజనం- యాజనం- అధ్యయనం-అధ్యాపనం, దానం-ప్రతి గ్రహణం) నిరతులు. ఇతిహాసపురాణ, శాస్త్ర కోవిదులు. ఒకటేమిటి సకల సద్గుణవంతులు. అక్కడ వుండే బ్రాహ్మణులే కాదు క్షత్రియాది వర్ణాలవారు కూడా ధర్మనిరతులు.

ఎంతో పవిత్రమైన ఆ ఓఢ్ర దేశంలో కోణాదిత్యుడు అనే పేరుతో సూర్యభగవానుడు వెలిసాడు. ఆయన్ని దర్శిస్తే చాలు పాపాలన్నీ పటాపంచలై పోతాయి. ఆ ఆలయ ప్రాంగణం దాని పరిసరాలు మొత్తం అర్ధయోజనం కొలతలతో వుంటాయి. అక్కడి సూర్యక్షేత్రం ఎంతో మహిమాన్వితమైనది. దర్శించిన భక్తులకి ముక్తిని ప్రసాదిస్తుంది.

మాఘమాసం సూర్యుడికి ప్రీతికరం. అందుకే ఆ మాసంలో శుక్లపక్ష సప్తమి (రథసప్తమి) నాడు తెల్లవారు ఝామునే లేచి సూర్యదేవాలయానికి దగ్గరలో వున్న సముద్రంలో స్నానం చేసి, దేవ,ఋషి పితృతర్పణాలు సమర్పించాలి. తరువాత తెల్లని వస్త్రాలు ధరించి సముద్రతీరంలో సుఖంగా కూర్చుని ఎనిమిది రేకులతో ఒక పద్మాకారాన్ని ఎర్రని వర్ణంతో లిఖించాలి. (అష్టదళపద్మం) దానికి మధ్యలో కర్ణిక కూడా వుండాలి. శుచిగా ఆచమనం చేసి ఎర్రచందనం, నువ్వులు, బియ్యం, ఎర్రనిపూలు, దర్భలు ఒక రాగి పాత్రలో ఉంచి అందులో నీళ్ళుపోసి ఆ పాత్రని మరో పాత్రతో మూసివేయాలి. అప్పుడు తిరిగి ఆచమనం అంగన్యాస కరన్యాసాలు చేసి భాస్కరుణ్ణి ధ్యానించాలి. ఆ అష్టదళపద్మానికి నైరృతి, ఆగ్నేయ, వాయవ్య, ఈశాన్య దిశలో మధ్యలో భక్తిగా పూజించాలి.

అష్టదళపద్మాన్ని ఆరాధించిన తరువాత ఆకాశం నుంచి ఆదిత్యుణ్ణి తామర పువ్వు మధ్యలో వున్న కర్ణిక మీదకి ఆవాహన చేయాలి. తరువాత ముద్రల్ని ప్రదర్శించి

పింగాక్షం ద్విభుజం రక్తం పద్మపత్రారుణాంబరమ్ ।
సర్వలక్షణ సంయుక్తం సర్వాభరణ భూషితమ్ ॥ 1
సురూపం వరదం శాంతం ప్రభామండల మండితమ్ ।
ఉద్యంతం భాస్కరం దృష్ట్వా సాంద్రసింధూర సన్నిభమ్ ॥ 2

*(శ్లో॥ 30-31, అధ్యా 28)*

రెండు భుజాలతో, తేనెరంగుకళ్ళతో అరుణ పద్మంలాంటి వస్త్రాల్ని ధరించి, సర్వాభరణ భూషితుడుగా, సర్వలక్షణ సంపన్నుడుగా, శాంతమూర్తిగా, వరముద్రని ధరించిన వాడిగా, ప్రభామండలంలో ప్రకాశించేవాడిగా, ఆ సూర్య భగవానుణ్ణి ధ్యానించాలి. తరువాత మోకాళ్ళ మీద కూర్చుని పూజాద్రవ్యాలు ఉంచి మూతపెట్టిన పాత్రని పైకి ఎత్తి పట్టుకుని తలమీద ఉంచి, త్ర్యక్షర (మూడు అక్షరాల) మంత్రంతో సూర్యుడికి, అర్ఘ్యం /బీఇవ్వాలి. సూర్యమంత్రాన్ని ఉపదేశం పొందని వారు 'ఓం సూర్యాయ నమః తర్పయామి' అని సూర్యుడి పేరు ఉచ్చరించి తర్పణం ఇవ్వవచ్చు.

ఈ విధంగా తర్పణం చేసిన తరువాత ఆగ్నేయ, నైఋతి, వాయువ్య, ఈశాన్య, మధ్య, తూర్పుదిశల్లో హృదయం శిరస్సు, శిఖ, కవచ, నేత్ర, అస్త్ర మంత్రాలతో పద్మంలోకి ఆవాహనం చేసిన సూర్యుణ్ణి పూజించాలి. పూజానంతరం బెల్లంతో వండిన పొంగలిని నైవేద్యం పెట్టి సూర్యమంత్రాన్ని యథాశక్తి జపించి తిరిగి ముద్రల్ని ప్రదర్శించి విసర్జన చెప్పాలి. భక్తిగా ఎవరైతే సూర్యుడికి ఈ విధంగా తర్పణం పూజచేస్తారో వారికి త్రైలోక్య దీపకారకుడైన సూర్యభగవానుడు, ఆయురారోగ్య ఐశ్వర్యాలని ప్రసాదిస్తాడు. సుఖాల్ని కోరుకునే మానవులు, సూర్యుణ్ణి పూజించకుండా శివకేశవుల్ని పూజించకూడదు.

సముద్రతీరంలో ఈ విధంగా అర్ఘ్య పూజల్ని నిర్వర్తించాక ఎర్రనిపుష్పాలు తీసుకుని కోణాదిత్యుడి ఆలయంలోకి వెళ్ళాలి. ముందుగా ఆలయం చుట్టూ మూడు ప్రదక్షిణాలు చేసి, తరువాత ఆలయం లోపలికి వెళ్ళి స్వామిని పూలతో పూజించాలి. ఇలా చేసిన భక్తుడు మరణానంతరం సూర్యలోకానికి చేరుకుంటాడు. అతడికి దశాశ్వమేధయాగాలు చేసిన ఫలితం లభిస్తుంది. ఈ దివ్యాలయాన్ని శయన, ఉత్థాన ఏకాదశీ తిథుల్లో, భానుసంక్రమణ తిథుల్లో, సప్తమీ ఆదివారం వచ్చిన రోజుల్లో దర్శించి అర్ఘ్య పూజాదికాలు నిర్వహిస్తే సకల శుభాలు కలుగుతాయి.

కోణాదిత్య (కోణార్క) క్షేత్రం ఎంతో మహిమాన్వితమైనది. అక్కడి సముద్రతీరంలో రామేశ్వరుడనే పేరుతో ఒక శివాలయం కూడా ఉంది. ఆ రామేశ్వరుణ్ణి అర్చించిన వారికి రాజసూయయాగఫలం లభిస్తుంది. ఈ దివ్యక్షేత్రంలో ఎవరైనా మరణిస్తే సూర్యలోకాన్ని చేరుకుంటాడు. తిరిగి అతడు మానవజన్మ ఎత్తి ధర్మపరిరక్షణ చేసే మహారాజవుతాడు. ఇది కోణాదిత్య క్షేత్రమహిమ.

## సూర్యుడి పూజావిధానం - ఫలితాలు

భక్తితో సూర్యుడి చుట్టూ 12 ప్రదక్షిణాలు చేస్తే ఆయన ఎంతో సంతోషిస్తాడు. సూర్యుడికి చేసిన ప్రదక్షిణం భూమండలం చుట్టూ చేసిన ప్రదక్షిణతో సమానం. అంతేకాదు సకల దేవతలకీ ప్రదక్షిణ చేసిన ఫలితం కూడా లభిస్తుంది. షష్ఠి తిథి లేక సప్తమీ తిథి నాడు గానీ ఏకభుక్తంతో ఉపవాసదీక్ష వహించి సూర్యుణ్ణి అర్చిస్తే అశ్వమేధఫలం లభిస్తుంది. కృష్ణపక్ష సప్తమి తిథినాడు ఆయన్ని అర్చిస్తే పద్మంలా ప్రకాశించే దివ్య విమానాన్ని ఎక్కి సూర్యలోకానికి వెళ్ళే యోగ్యత లభిస్తుంది. శుక్ల పక్ష సప్తమినాడు ఉపవాసం ఉండి తెల్లని పూలతో ఆయన్ని పూజిస్తే ముందు చెప్పిన ఫలితమే కలుగుతుంది.

రాగి పాత్రలో నీరు పోసి ఆ నీటిని క్రమంగా ఒక్కొక్కటీ పెంచుతూ ఇరవై నాలుగు రోజులు ఆ పాత్రల్లోని నీటిని త్రాగాలి. ఇరవై నాలుగు రోజుల

తరువాత తిరిగి 24 పాత్రల నుంచి 1 పాత్ర వరకూ తగ్గించుకుంటూ అందులో నింపిన నీటిని త్రాగాలి. ఈవిధంగా రెండు సంవత్సరాలు చేస్తే వ్రతం సమాప్త మవుతుంది. దీనినే సూర్య సప్తమీ వ్రతం అంటారు. (పాత్ర చిన్నది అయి వుండాలి) శుక్లపక్షసప్తమీ ఆదివారం కలిసి వస్తే దాన్ని విజయ సప్తమి అంటారు. ఆ రోజు జపం, ధ్యానం, దానం, హోమం, ఏది చేసినా విజయం లభిస్తుంది.

ఆదివారం నాడు పితృదేవతలకి శ్రాద్ధం పెట్టినా, తెల్లజిల్లేడుతో హోమం చేసినా, అభీష్ట సిద్ధి కలుగుతుంది. వారి వంశంలో అనారోగ్యంతో వుండేవాడు, దరిద్రుడు ఎప్పటికీ జన్మించడు. తెలుపు, ఎరుపు, పసుపుపచ్చ రంగులో వుండే మట్టిని వంటికి పూసుకునేవాడికి, చిత్ర విచిత్రమైన రంగురంగుల పూలతో చిత్రభానుణ్ణి అర్చించి ఉపవాసం ఉండిన వాడికి కోరిన కోరికలు నెరవేరతాయి. ఆవునెయ్యి లేక నువ్వులనూనెతో గానీ దీపాన్ని వెలిగించి సూర్యుణ్ణి పూజించిన వారికి కంటి జబ్బులు రావు. దీపాన్ని దానం చేసినవాడికి జ్ఞానం వృద్ధి చెందుతుంది. నువ్వులతో సహా గోదానం చేస్తే అది ఎంతో పుణ్య ప్రదం. నాలుగు దారులు కలిసేచోట, రాజమార్గాలతో దీపదానం చేసినవాడు భాగ్యవంతుడవుతాడు.

దీపం ఎప్పుడూ ఊర్ధ్వముఖంగానే వెలుగుని ప్రసరిస్తూ వుంటుంది. కనుక దీపదానం చేసినవాడికి ఉత్తమగతేగానీ అధోగతి ఎప్పటికీ వుండదు. దీపం ఎంతో పవిత్రమైనది. అందుకే వెలుగుతున్న దీపాన్ని తగ్గించకూడదు. ఆర్పేయకూడదు. అలా ఎవరైనా చేస్తే బంధనాలు, వినాశనం పొందుతాడు. దీపదానం చేసినవాడు స్వర్గలోకంలో ప్రకాశిస్తాడు. కుంకుమ, ఎర్రచందనం, అగరు, ఎర్రటి పుష్పాలు ఉపయోగించి సూర్యభగవానుణ్ణి అర్చించినవాడు, ఆయనకి అర్ఘ్యాలు సమర్పించినవాడు ఒక సంవత్సరంలో ఇష్టసిద్ధిని పొందగలుగుతాడు.

సూర్య భగవానుడిని ఉద్దేశించి ఉదయం నించి ఆయన అస్తమించేదేకా నిల్చుని సూర్యమంత్రాన్ని జపించినా, సూర్యస్తోత్రాన్ని పఠించిన సకల పాపాల నుంచీ విముక్తి కలుగుతుంది. దీన్నే ఆదిత్యవ్రతం అంటారు. సూర్యుడికి

అర్ఘ్యాన్ని కుడివైపుగానీ, ఎడమవైపుగానీ ఇవ్వకూడదు. ఆయనకి ఎదురుగా నిలబడి అర్ఘ్యప్రదానం చేయాలి. సూర్యుడికి ప్రీతికరమైన గుగ్గులుకర్ర, మారేడు, దేవదారు చెట్టు కర్రలతో చేసిన నలుపలకల ఆసనాన్ని సమర్పించాలి. తరువాత కర్పూరం అగరులతో ఆయనకి ధూపాన్ని వేయాలి. అలా చేసినవాడికి స్వర్గప్రాప్తి కలుగుతుంది.

రాత్రి పగలు సమానంగా వున్న రోజు సూర్యుణ్ణి అర్చిస్తే సకల దురితాలు నివారించబడతాయి. పులగం, పాయసం, ఆవుపాలు, పళ్ళు, దుంపలు, నెయ్యి సూర్యుడికి ప్రీతికరమైనవి. వీటితో ఆయనకి నైవేద్యం సమర్పిస్తే సర్వకామ్యాలూ సిద్ధిస్తాయి. ఆవునెయ్యితో సూర్యుడికి తర్పణం విడిస్తే సర్వసిద్ధులు కలుగుతాయి. ఆవుపాలతో తర్పణం చేస్తే మనఃస్తాపాలు హరిస్తాయి. ఆవుపెరుగుతో చేస్తే సకలకార్యసిద్ధి కలుగుతుంది. పవిత్ర జలంతో సూర్యుడికి స్నానం చేయిస్తే పరమపదం ప్రాప్తిస్తుంది. ఏ ద్రవ్యం సూర్యుడికి మనం సమర్పిస్తే ఆ ద్రవ్యం అనంతంగా మనకి ప్రాప్తిస్తుంది.

## సూర్యుడి అష్టోత్తర శతనామస్తోత్రం

ఓం సూర్యో ఽర్యమా భగస్త్వష్టా పూషాఽర్కః సవితా రవిః ।
గభస్తిమా నజః కాఓ మృత్యుర్ధాతా ప్రభాకరః ॥

పృథివ్యాపశ్చ తేజశ్చ ఖం వాయుశ్చ పరాయణం ।
సోమో బృహస్పతిః శుక్రో బుధో ఽంగారక ఏవచ ॥

ఇంద్రో వివస్వాన్ దీప్తాంశుః శుచిః శౌరిః శనైశ్చరః ।
బ్రహ్మో విష్ణుశ్చ రుద్రశ్చ స్కందో వైశ్రవణో యమః ॥

వైద్యుతో జాఠర శ్చాగ్ని రైంధన స్తేజసాం పతిః ।
ధర్మధ్వజో వేదకర్తా వేదాంగో వేదవాహనః ॥

కృతం త్రేతా ద్వాపరశ్చ కలిః సర్వామరాశ్రయః ।
కలా కాష్ఠా ముహూర్తాశ్చ క్షపా యామా స్తథా క్షణాః ॥

సంవత్సరకరో ఽ శ్వత్థః కాలచక్రో విభావసుః ।
పురుషః శాశ్వతో యోగీ వ్యక్తావ్యక్తః సనాతనః ॥

కాలాధ్యక్షః ప్రజాధ్యక్షో విశ్వకర్మా తమోనుదః ।
వరుణః సాగరోఽ ంశశ్చ జీమూతో జీవనో ఽ రిహా ॥

భూతాశ్రయో భూతపతిః సర్వలోక నమస్కృతః ।
స్రష్టా సంవర్తకో వహ్నిః సర్వస్యా ఽ ఽ ది రలోలుపః ॥

అనంతః కపిలో భానుః కామదః సర్వతోముఖః ।
జయో విశాలో వరదః సర్వభూతనిషేవితః ॥

మనః సుపర్ణో భూతాదిః శీఘ్రగః ప్రాణాధారణః ।
ధన్వంతరి ర్ధూమకేతు రాదిదేవో ఽ దితేః సుతః ॥

ద్వాదశాత్మా రవి ర్దక్షః పితా మాతా పితామహః ।
స్వర్గద్వారం ప్రజాద్వారం మోక్షద్వారం త్రివిష్టపమ్ ॥

దేహకర్తా ప్రశాంతాత్మా విశ్వాత్మా విశ్వతోముఖః ।
చరాచరాత్మా సూక్ష్మాత్మా మైత్రేయః కరుణాన్వితః ॥

ఏతద్వై కీర్తనీయస్య సూర్య స్యామిత తేజసః ।
నామ్నా మష్టశతం రమ్యం మయా ప్రోక్తం ద్విజోత్తమాః ॥

సురగణ పితృ యక్ష సేవితం । హ్యసుర నిశాకర సిద్ధవందితం ।
వరకనక హుతాశన ప్రభం ప్రణిపతితోఽ స్మి హితాయ భాస్కరమ్॥

బ్రహ్మ దేవుడు స్వయంగా చెప్పిన ఈ సూర్య అష్టోత్తర శతనామ స్తోత్రం ఎంతో మహిమాన్వితమైనది. ప్రతి రోజూ సూర్యోదయ కాలంలో భక్తి శ్రద్ధలతో ఈ స్తోత్రాన్ని చదివిన వాడికి యోగ్యురాలైన భార్య, ఉత్తమ సంతానం, ధనధాన్య వృద్ధి కలుగుతాయి. అతడికి గొప్ప ధారణశక్తి కూడా లభిస్తుంది. సంసార సాగరాన్ని అవలీలగా అతడు దాటగలడు. సూర్యుడి అనుగ్రహంతో అతడికి అనారోగ్య బాధలుండవు. ఏది కోరుకుంటే అది లభిస్తుంది.